సాక్షి ప్రకాశం

సోమవారం । 22 । జూన్ । 2026

ఇద్దరు యువకుల దుర్మరణం

లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన మేదరమెట్లలో ఆదివారం జరిగింది. - 8లో..

రైతులను మోసం చేసేందుకు కుయుక్తులు

పొగాకు రైతులను దెబ్బతీసేందుకు బోర్డు అధికారులు నాటకాలాడుతున్నారని కిసాన్ మోర్చా నాయకులు ధ్వజమెత్తారు. - 8లో..

ఉష్ణోగ్రతలు

	గరిష్టం	కనిష్టం
ఒంగోలు	34	28
మార్కాపురం	36	28
కనిగిరి	36	28

న్యూస్‌లీల్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో యోగాలో పాల్గొన్న కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ కల్పనా కుమారి

ఒంగోలు టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, శారీరకంగానే కాకుండా మానసికంగా ఆత్మవిశ్వాసనం పెంపొందిస్తుందని కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా 3.63 లక్షల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అంతకుమించి హాజరయ్యారని తెలిపారు. గత 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా 4428 వేదికలపై యోగాభ్యాసన నిర్వహించినట్లు తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించి ఆరోగ్యవంతులుగా జీవించాలని సూచించారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కుదుట పడుతుందని, సానుకూల దృక్పథంతో జీవించవచ్చని చెప్పారు.

2 వేల మంది మహిళలతో యోగా...

ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు జరిగిన ఈ యోగా కార్యక్రమంలో 2 వేలకు పైగా మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, నగర ప్రజలు పాల్గొన్నారు. అనంతరం రెండు వారాలుగా యోగాసనాల్లో శిక్షణ ఇచ్చిన గురువులను ఘనంగా సత్కరించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలను స్వీకరించబోమని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మాధురి, జిల్లా పర్యాటక అధికారి తేళ్ల రవికుమార్, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ భీమ్‌నాథ్, డీఎస్పీలు శ్రీనివాసరావు, బాల మురళీకృష్ణ, గురునాథ బాబు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ..గుండె కోత

అక్రమార్జనే పరమావధిగా టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. వాగులు, వంకలు, చెరువులు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి, ఇసుక, గ్రావెల్ తవ్వి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రకాశం జిల్లాలో సాగు, తాగునీటికి ప్రధాన ఆధారమైన గుండ్లకమ్మ వాగును చెరబట్టిన తెలుగు తమ్ముళ్లు నదీ పరీవాహక ప్రాంతంలోని ఇసుకను ఇష్టారీతిగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. ఇసుక తవ్వకాలపై స్థానికులు సమాచారం ఇచ్చినా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇంకా తవ్వకాలకు తెగబడుతున్నారు.

- గుండ్లకమ్మ నదిలో అక్రమంగా ఇసుక తవ్వేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- ట్రాక్టర్ రూ.3 నుంచి రూ.4 వేలకు విక్రయం
- స్థానికుల అవసరాలకు కూడా ఇసుక తోలేది వారే..
- ఫిర్యాదులున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

మల్లవరం వద్ద ఇసుక తవ్విన దృశ్యం

మల్లవరం నుంచి బయట మండలాలకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

రాచవారిపాలెం సమీపంలో ఇసుక తవ్విన ఆనవాళ్లు

కొలచనకోట సమీపంలో పెద్ద విద్యుత్ లైన్ల వద్ద ఇసుక తవ్వేసిన దృశ్యం

మద్దిపాడు:

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక తెలుగు తమ్ముళ్లు అక్రమార్జన కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. మండలంలోని గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాన్ని చెరబట్టి సర్వనాశనం చేస్తున్నారు. గుండ్లకమ్మ నదిలో దొరికే నాణ్యమైన ఇసుక వారికి ఆదాయ వనరుగా మారింది. ముఖ్యంగా మల్లవరం, కొలచనకోట, కెల్లంపల్లి, మద్దిపాడు, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామాల్లో నది పరివాహక ప్రాంతం నుంచి భారీగా ఇసుక తరలిస్తూ లక్షల రూపాయలు జేబులు నింపుకుంటున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారంటూ అధికారులకు సమాచారం ఇస్తే వారు అక్రమార్కులకు సమాచారం చేరవేసి, అక్రమ ఇసుక రవాణాదారులు అక్కడ నుంచి వెళ్లిపోయిన తరువాత సోదాలు చేయడానికి వెళుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరిన వ్యక్తులు కొందరు అన్ని స్థాయిల్లో అధికారులతో మాట్లాడి వారికి మామూళ్లు ముట్టజెప్పి పనులు కానిచ్చేస్తున్నారు. ఇటీవలి కాలంలో కొలచనకోట వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పోలీసు శాఖకు సమాచారం ఇచ్చినా అక్కడ ఉన్న జేసీబీలను వదిలేసి రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి మమ అనిపించారు. జేసీబీలు సీజ్ చేయకపోవడానికి వాటి యజమానులు అధికార పార్టీ నాయకులు కావడం, మామూళ్లు అందడమే కారణమన్నది బహిరంగ రహస్యం.

ఇసుక రీచ్ అడ్డుకుని..అక్రమంగా దండుకుని..

ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడానికి గతంలో ప్రయత్నాలు జరిగినా ఇసుక అక్రమ రవాణాదారులు పలు మార్గాల్లో అడ్డుకున్నారు. ఇసుక రీచ్ లేకపోవడంతో యథేచ్ఛగా ఇసుక అక్రమంగా రవాణా చేయడానికి వీలు దొరికినట్లయింది. ఇసుక దందాలో స్థానిక నాయకులతో పాటు పైస్థాయి నాయకునికి, మండల, ఉన్నత స్థాయి అధికారులకు వాటాలు అందుతుండడంతో ఎవరికి వారు తేలు కుట్టిన దొంగల్లా కిమ్మనకుండా ఉండిపోతున్నారన్నది ప్రజల అభియోగం. ఇసుకను గుండ్లకమ్మ నది నుంచి బయటకు తరలించి డంప్ చేసి, కావలసిన వారికి ట్రాక్టర్ రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడం ఇసుక అక్రమ రవాణాదారులకు సర్వసాధారణమైపోయిందని మండిపడుతున్నారు.

ప్రశ్నించేవారిపై దౌర్జన్యాలు

ఇటీవల నాలుగు రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణాపై నివేదిక ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఇంటలిజెన్స్ ఏఎస్ఐపై కూడా దౌర్జన్యంగా మాట్లాడడం, రెవెన్యూ కింది స్థాయి అధికారులైన వీఆర్ఏలను ట్రాక్టర్‌లతో తొక్కిస్తామని ముందుకు ట్రాక్టర్‌పై దూసుకొచ్చిన ఘటనలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి అధికారులకు ఏఎస్ఐ ఫిర్యాదు చేయడం, అదేవిధంగా మండల స్థాయి అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. ఇంత దౌర్జన్యంగా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని స్థానిక ప్రజలు తెలిపారు. పంచాయతీలకో, మైనింగ్ శాఖకో రావాల్సిన ఆదాయాలకు గుండి కొట్టి జేబులు నింపుకుంటున్నారు. గుండ్లకమ్మ నది సమీపంలో ఉండే గ్రామాల్లో వారు స్థానికంగా నిర్మాణాలు చేసుకునేందుకు ఇసుక కోసం వెళితే వారిని బెదిరించి బయటకు పంపేస్తున్నారని, తమకు చెబితే తామే తోలుతామంటున్నారని స్థానికులు కొందరు తెలిపారు. తమ గ్రామం నుంచి ఇసుక తీసుకెళ్లి వేరే మండలాల్లో అమ్ముకుంటూ ఇక్కడి వారిపై దౌర్జన్యం చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా ప్రవర్తించడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నిలిపేసి స్థానికుల అవసరాలకు అనుగుణంగా ఇసుక లభ్యత కల్పించాలని కోరుతున్నారు.

రైతుల కడగండ్లు

ఒక్క నీటి బొట్టూ వృథా కాకూడదు..జలరక్షణే బాధ్యత అంటూ.. జలధార –జలహారతి పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిపై ప్రచార ఆర్భాటం తప్ప క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నాయి. అక్రమార్జనకు అలవాటుపడిన కొందరు టీడీపీ చోటా నేతల చేష్టలు జల సంరక్షణ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. అధికార పార్టీ అండతో చేపల కాసుల వేట కోసం... చెరువులకు గండ్లు కొడుతున్నారు. ఫలితంగా లక్షల లీటర్ల నీరు నేల పాలై వృథాగా పోతున్నాయి. అక్రమార్జనకు అలవాటు పడిన ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు దీనిపై మౌనం దాల్చుతున్నారు.

- ఓ వైపు జల హారతులు.. మరో వైపు అక్రమార్జనకు గోతులు
- చేపల కోసం రిజర్వాయర్లు, చెరువులకు పచ్చ నేతల గండ్లు
- రిజర్వాయర్లకు రక్షణ కరువు
- ఇరిగేషన్ అధికారుల తీరుపై మండిపడుతున్న రైతులు
- రెండేళ్లయినా.. శాశ్వత మరమ్మతులకు నిధులు విదల్చని వైనం

కనిగిరిరూరల్: చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక చోట్ల చేపల కోసం చెరువులను, రిజర్వాయర్‌లకు, వాగులకు గండ్లు వేసిన ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల తూర్పు ప్రకాశంలోని కొన్ని నియోజకవర్గాల్లో కూడా చేపల కాంట్రాక్టర్లు స్థానిక నాయకులు, అధికారుల అండతో గండ్లు కొట్టారు. గత ఏడాది జిల్లాలోనే పెద్ద రిజర్వాయర్‌లలో ఒకటైన మోపాడు రిజర్వాయర్ అలుగు వాగుకు గండి కొట్టారు. దీంతో అప్పట్లో వామపక్ష నాయకులు, రైతులు తీవ్ర ఆందోళన చేశారు. రిజర్వాయర్‌కు గండికొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే గండి పూడ్చాలని కలెక్టర్‌కు, జిల్లా ఇరిగేషన్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ ఘటనకు కారకులు చేపల కాంట్రాక్టర్లే అని తీవ్ర ప్రచారం కూడా జరిగింది. తాజాగా కనిగిరి నేలటూరి గొల్లపల్లి రిజర్వాయర్‌కు కొందరు అక్రమార్కులు గండికొట్టారు. తూము రంధ్రానికి తొర్ర పెట్టడంతో లక్షల లీటర్ల నీళ్లు వృథా అయ్యాయి. రిజర్వాయర్‌కు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, తక్షణం శాశ్వత మరమ్మతు చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ కలెక్టర్, ఇరిగేషన్ జిల్లా అధికారికి, ఆర్డీఓకు ఫిర్యాదు కూడా చేశారు. ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతు చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టారు. కారణాలు ఏమైనా.. కారకులు ఎవరైనా.. రిజర్వాయర్‌కు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, రెవెన్యూ, నీటి సంఘ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ తర్వాత దానిపై ఎటువంటి చర్యలు లేవు.

అవసాన దశలో ప్రధాన రిజర్వాయర్లు..

కనిగిరి అనగానే గుర్తుకొచ్చేది నీటి సమస్య. అలాంటి కరువు ప్రాంతానికి సాగు, తాగునీటికి శాశ్వత వనరులు లేవు. ఇక్కడి ప్రజలకు వర్షాధారిత పంటలే.. వర్షపు ప్రతి నీటి బొట్టు విలువైనదే. అయితే మూడేళ్ల క్రితం వచ్చిన తుఫాను వర్షాలకు, ఇటీవల అకాల వర్షాలకు దాదాపు అన్ని ప్రధాన రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వ ఉంది. వాటి వల్ల భూగర్భ జలమట్టాలు తగ్గలేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం నీటి సమస్య అంతగా లేదు. అలాంటి పరిస్థితుల్లో నీటి వనరులను పూర్తిగా సంరక్షించుకోవాల్సిన అధికారులు, పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పైగా చేపల వేట కోసం.. కాసుల కక్కుర్తి పడి ఉన్న నీటి వనరులకు గండి కొడుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని 135 పంచాయతీల్లో సుమారు 132 రిజర్వాయర్లు, చెరువులు ఉన్నాయి. వీటిలో ప్రధాన రిజర్వాయర్లు అయిన మోపాడు, మాకేరు వాగు, పందువ గండి, నేలటూరి గొల్లపల్లి, పునుగోడు రిజర్వాయర్లలో ప్రస్తుతం సంవృద్ధిగా నీళ్లున్నాయి. అయితే వీటన్నింటికీ తూములు, షట్టర్లు, కట్టలు దెబ్బతిని తాత్కాలిక మరమ్మతులతో ఉన్నాయి. తుఫాను లాంటి వర్షాలు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు, పాలకులు, ఆ తర్వాత పట్టించుకునే పరిస్థితి లేదు. కారణాలు ఏమైనా.. గత రెండేళ్లుగా శాశ్వత మరమ్మతులు జరిగిన దాఖలాలు లేవు.

ఎన్ గొల్లపల్లి రిజర్వాయర్‌కు గండికొట్టిన దృశ్యం(ఫైల్)

కనీస రక్షణ ఏదీ..

రిజర్వాయర్లకు గండ్లు అధికారులకు తెలిసే జరుగుతున్నాయా..? అనే అనుమానాలు రైతుల్లో, ప్రజల్లో రేకెత్తుతున్నాయి. కనీసం ప్రధాన రిజర్వాయర్ల వద్ద కూడా వాచ్‌మెన్‌లు లేరు. ప్రస్తుతం ప్రభుత్వం, అధికారులు, నీటి రక్షణకు ప్రథమ ప్రాధాన్యత అంటున్నారు. మరి అలాంటప్పుడు చెరువులకు గండ్లు కొడుతుంటే.. నీటి వనరుల పట్ల ఇరిగేషన్ అధికారులు ఎందుకు ప్రత్యేక దృష్టి పెట్టడం లేదో అర్థం కావడం లేదు. ఇటీవల జిల్లాలో, కనిగిరి నియోజకవర్గంలో జరిగిన చెరువులకు గండ్లు వేసిన ఘటనలు ఇరిగేషన్ అధికారుల నిజాయితీని ప్రశ్నిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారుల తీరుపై ప్రజల్లో, రైతుల్లో తీవ్ర అనుమానాలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రధాన నీటి వనరుల రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారుల పై ఉంది.

ఇరిగేషన్ ఏఈ ఏమంటున్నారంటే..

దీనిపై కనిగిరి ఇరిగేషన్ ఏఈ మధుబాబును వివరణ అడగ్గా.. ''నేలటూరి గొల్లపల్లి రిజర్వాయర్ తూముకు గండికొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రస్తుతం నీటి వృథాను అరికట్టాం. నీరు బయటకుపోవడం లేదు. రిజర్వాయర్ల శాశ్వత మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. కనిగిరి పెద్దచెరువు అభివృద్ధికి రూ.40 లక్షలతో, పునుగోడు రిజర్వాయర్‌కు రూ.45 లక్షలతో, ఎన్ గొల్లపల్లి రిజర్వాయర్‌కు రూ.50 లక్షలతో మరమ్మతులు, అభివృద్ధి పనులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం'' అని చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో ఓటు గల్లంతు ఖాయం

- బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి
- డబుల్ ఓట్లను గుర్తించాలి, వైఎస్సార్ సీపీ వర్గీయుల ఓట్లు తొలగించకుండా జాగ్రత్త పడాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్

బీఎల్‌పల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ వర్గీయుల ఓట్లు గల్లంతు కావడం ఖాయమని, గ్రామాల్లో బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల బీఎల్ఏల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల్లో నేరుగా గెలిచే పరిస్థితిలేదని, ఆయన వెన్నుపోటులతోనే అధికారంలోకి వస్తుంటారన్నారు. తిరిగి అధికారంలోకి రావటానికి తమ ఓట్లు గల్లంతు చేస్తారన్న విషయాన్ని గమనించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి వైఎస్సార్ సీపీ వర్గీయుల ఓట్లు తీసివేసే ప్రక్రియ కచ్చితంగా సాగుతుందన్నారు. ఇటీవల రెండు సంవత్సరాల వెన్నుపోటు కార్యక్రమానికి ప్రజలు హాజరు కాలేదని, యర్రగొండపాలెంలో జరిగిన విజయోత్సవానికి కేవలం వంద మంది మాత్రమే పాల్గొన్నారని అన్నారు. దీనినిబట్టి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ఎంత బలంగా పెరుగుతోందో చెప్పవచ్చన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టించి తమపై ఉన్న వ్యతిరేకతను తప్పుదోవ పట్టించడమే చంద్రబాబు ఎత్తుగడ అన్నారు. బీఎల్ఏ పెద్ద బాధ్యత తీసుకున్న వ్యక్తని, కూటమి నాయకులు మూడు పార్టీల నుంచి ముగ్గురు బీఎల్ఏలను పెట్టుకుంటారని, గ్రామంలోకి బీఎల్ఓ వస్తుంటే ఆ రోజు తమ సమయాన్ని వెచ్చించి ఆయనతోపాటే ఉండాలని సూచించారు. ఓడిపోవటానికి, గెలవటానికి ఒక్క ఓటు చాలని, అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు ఒక్క ఓటుతోనే ఓడిపోయిన వారున్నారని, ఆ ఒక్క ఓటేకదా అని ఆలోచిస్తే దెబ్బతగిలేది ఎమ్మెల్యేకే కాదని మొదటి సారి గ్రామాల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర అలజడి సృష్టిస్తుందని అన్నారు. ఆయా బూత్‌లలో డబుల్ ఓట్లు ఎన్ని ఉన్నాయి... మరణించినవారు ఎంతమంది ఉన్నారు. వైఎస్సార్ సీపీకి సంబంధించి కొత్తగా చేరాల్సినవారు ఎంతమంది ఉన్నారు. ఈ గణాంకాలను తీసుకోవాలన్నారు. వాళ్లకు కావలసిన ఓట్లు అదనంగా ఉంచుకుంటారని, వద్దనుకునే ఓట్లు తీసివేయిస్తారని, ఈ ప్రక్రియ దేశంలోని అనేక రాష్ట్రాల్లో విజయవంతంగా చేయగలిగారన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన వారి ఓట్లు తొలగింపచేయకుండా, డబుల్ ఓట్లు ఎంట్రీ కాకుండా చూడాల్సిన పెద్ద బాధ్యత తమపై ఉందన్నారు. సదస్సుకు పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి అధ్యక్షత వహించగా ఎస్ఐఆర్ పార్టీ టాస్క్‌ఫోర్స్ జిల్లా సభ్యుడు పత్తి రవిచంద్ర, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారెడ్డి బీఎల్ఏలకు అవగాహన పరిచారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు కె.ఓబులరెడ్డి, కందూరి కాశీవిశ్వనాథ్, వై.వెంకటేశ్వరరెడ్డి, సూరె వెంకట రమేష్, షేక్.కాశింపీరా, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దోగిపర్తి సంతోషికుమార్, పి.రాములు నాయక్, సింగా ప్రసాద్, ఆర్.అరుణాబాయి, పల్లె సరళ, యక్కలి రాంబాబు పాల్గొన్నారు.

సజావుగా నీట్ పరీక్ష

- పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు సిటీ: మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన 'నీట్' పరీక్ష ఒంగోలు నగరంలోని ఆరు కేంద్రాల్లో సజావుగా జరిగింది. మొత్తం 1821 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 1624 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. 197 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అధికారులు అన్ని సౌకర్యాలను కల్పించారు. నగరంలోని నవోదయ, కేంద్రీయ విద్యాలయం, డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, డీఆర్ఆర్ఎం పాఠశాల, పీవీఆర్ బాలుర పాఠశాలల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి నీట్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష ప్రారంభానికి ముందు భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్ని సెంటర్లలో ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ సర్వైలెన్స్, మొబైల్ పెట్రోలింగ్ బృందాల ద్వారా నిరంతర నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలను రెండు జోన్లుగా విభజించి, భద్రతా పర్యవేక్షణ కోసం ప్రతి జోన్‌కు అదనంగా ఒక ఇన్‌స్పెక్టర్‌ను కేటాయించామన్నారు. రైల్వే స్టేషన్‌లు, బస్‌స్టాండ్‌ల వద్ద ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, సీఐలు ఉన్నారు.

ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలతో యోగా డే

- ప్రజల్లో కానరాని స్పందన

యోగా కార్యక్రమంలో వృద్ధ మహిళల పాట్లు

కంభం: యోగాంధ్ర-2026 కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అధికారులు నానా తంటాలు పడ్డారు. అధికారులు నిర్వహించే యోగా కార్యక్రమాలకు ప్రజల్లో ఆదరణ కరువవడంతో జనసమీకరణ కోసం అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. గతేడాది యోగా కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు చనిపోయిన వారికి, వృద్ధులకు సైతం సర్టిఫికెట్లు మంజూరు చేయడం పలు విమర్శలకు తావిచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జరిగిన యోగా కార్యక్రమాలను విజయవంతం చేయడం కోసం కూడా వారు శ్రమించాల్సి వచ్చింది. ఆదివారం మార్కాపురం జిల్లా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన యోగా డే కార్యక్రమాల్లో అధికారులు, ప్రజల కంటే డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలే ఎక్కువగా ఉండటం విశేషం. ఎక్కువశాతం ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలుండగా కొందరు విద్యార్థులు, ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి రోజు కూలిపనులు చేసుకునే తమకు ఈ యోగా పాట్లేంటని ఉపాధి కూలీలు తలలు పట్టుకుంటున్నారు. ఖచ్చితంగా హాజరు కావాలని అధికారులు హుకుం జారీ చేయడంతో తప్పని సరిపరిస్థితుల్లో వృద్ధులు సైతం వచ్చి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధి సిబ్బంది అక్కడికి హాజరైన వారి పేర్లు నమోదు చేసుకుంటూ కనిపించారు. తమకు కూలీ డబ్బులు వేస్తామని చెప్పారని మరి వేస్తారో లేదో తెలియడం లేదని అక్కడికి వచ్చిన ఉపాధి కూలీలు చెప్పుకుంటున్నారు. 60-70 ఏళ్ల వయస్సులో మాకేంటి ఈ పాట్లను పలువురు వృద్ధ మహిళలు వాపోతున్నారు.

క్లుప్తంగా

శిద్దాకు అమెరికన్ డాక్టరేట్ ప్రదానం

● ఆధ్యాత్మిక, వ్యాపార సేవలకు గుర్తింపుగా..

డాక్టరేట్ అందుకుంటున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మకమైన మేరీల్యాండ్ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్శిటీ చాన్సిలర్, వైస్ చాన్సిలర్‌లు డాక్టర్ జాన్ ఎన్ కలరస్, సోఫియా సుభాని నిర్వహణలో ఉత్తమ సేవలలో ప్రతిభ కలిగిన వారిలో శిద్దా రాఘవరావును ఎంపిక చేశారు. డాక్టరేట్ అవార్డు ప్రదానోత్సవానికి శిద్దా రాఘవరావు అనివార్య కారణాల వలన అమెరికా వెళ్లలేకపోవడంతో గత 15 రోజుల క్రితం యూనివర్శిటీ ప్రతినిధుల ద్వారా ఒంగోలులోని ఆయన స్వగృహంలో అవార్డు అందించారు. ఆదివారం ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో రాఘవరావుకు వచ్చిన డాక్టరేట్ అవార్డును ప్రదర్శించారు. ఆయనను పలువురు అభినందించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యాపార రంగాలలో చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా మేరీల్యాండ్ యూనివర్శిటీ వారు డాక్టరేట్ అందించారని శిద్దా రాఘవరావు తెలిపారు. ఈ అవార్డు ద్వారా తాను చేస్తున్న సేవలకు గుర్తింపు దక్కడం సంతోషాన్ని కలిగించిందన్నారు.

శ్రీరాంనగర్‌లో చోరీ

● 51 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు చోరీ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్‌కు చెందిన మల్లెల వెంకటేశ్వర్లు నివాసంలో దొంగలు చోరీకి పాల్పడి సుమారు రూ.6 లక్షల విలువైన 51 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.23 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం తాను బేల్దారీ పనిచేసుకుని జీవిస్తానని, శనివారం స్వగ్రామమైన కందుకూరు మండలం వెంకన్నపాలేనికి భార్య ప్రమీలతో సహా వెళ్లానని తిరిగి ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయన్నారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయన్నారు. బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు యువకుల దుర్మరణం

● లారీని ఢీకొన్న బైక్
● మేదరమెట్ల కొండ సమీపంలో ప్రమాదం

మేదరమెట్ల: లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన మేదరమెట్ల ఉత్తర బైపాస్ ప్రాంతంలోని కొండ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..కందుకూరుకు చెందిన శ్రీరామచక్రి(22), ఓగూరుకు చెందిన చిట్టాల గోపీ(26)తో కలిసి మోటార్ బైక్‌పై విజయవాడ అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. వీరు మేదరమెట్ల ఉత్తర బైపాస్ కొండ ప్రాంతానికి రాగానే ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. ప్రమాదంలో శ్రీరామచక్రి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో చిట్టాల గోపీ తీవ్రంగా గాయపడగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై మహ్మద్ రఫీ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శ్రీరామచక్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆసుపత్రిలో మృతి చెందిన గోపీ

శ్రీరామచక్రి మృతదేహం

భారత సంస్కృతిని చాటిచెబుతున్న తాన్య

ఒంగోలు టౌన్: ఆమె పక్కా భారతీయురాలు. పుట్టింది యూరప్‌లో. పెరిగింది బెంగళూరు, చెన్నై, ఒంగోలులో. ఆమె పేరు గోపి తాన్య. తండ్రి గోపి వెంకట్ వృత్తిరీత్యా అమెరికాలో నివాసం ఉంటున్నారు. తల్లి ప్రవీణలత కొంతకాలం భర్తతో పాటే అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. తర్వాత ఇండియాకు తిరిగి వచ్చి ఒంగోలులో యోగా ట్రైనర్‌గా పనిచేస్తున్నారు. తాన్య ప్రస్తుతం చెన్నైలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యనభ్యసిస్తూనే విభిన్న కళల్లో రాణిస్తున్నారు. తాను చదువుతున్న కళాశాల కల్చరల్ విభాగానికి సెక్రటరీగా వ్యవహరిస్తున్న తాన్య.. వ్యాఖ్యతగా రాణిస్తున్నారు. ఒంగోలు, నెల్లూరు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో తిరుగుతూ మెడిటేషన్ బోధిస్తున్నారు. హార్ట్‌ఫుల్నెస్ ధ్యానాన్ని క్రమం తప్పకుండా ఆచరిస్తూ దాని ప్రాముఖ్యతను ఇతరులకు తెలియజేస్తున్నారు.

భగవద్గీత శ్లోకాలు చెబుతూ...

ఆధునిక విద్యనభ్యసిస్తున్న తాన్య భగవద్గీతను కంఠస్తం పట్టారు. అందులోని శ్లోకాలను స్పష్టంగా చెప్పి పలువురి ప్రశంసలు పొందుతున్నారు. భగవద్గీత పఠనం ద్వారా ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవడం గురించి వివిధ వేదికల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్వామీ వివేకానందుడి బోధనలకు ప్రభావితురాలైన ఆమె.. మోటివేషన్ టీచర్‌గా కూడా రాణిస్తున్నారు. చిన్నారులకు ఉపయోగపడే విధంగా ది షంట్ ఆబ్సెషన్ అనే పుస్తకాన్ని రచించారు. తాన్యకు హిందీ భాషపై మంచి పట్టు ఉంది. హిందీలో ఆధ్యాత్మిక అంశాలతో కూడిన గజల్స్ రచిస్తున్నారు.

కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇస్తూ...

ప్రభుత్వ శిక్షణ సంస్థలో కూచిపూడిలో శిక్షణ పొందిన తాన్యకు భారతీయ నృత్యం అంటే ఎంతో ఇష్టం. అందుకే భారత సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే ఉద్దేశంతో బెంగళూరు, చెన్నై, నెల్లూరు, ఒంగోలులో నృత్య ప్రదర్శనలిచ్చారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల వందేళ్ల వేడుకల్లో కూడా కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకుల చేత ప్రశంసలు పొందారు. ఇప్పటి వరకు దేశ విదేశాలలో 150 ప్రదర్శనలిచ్చి శభాష్ అనిపించుకున్నారు. చిన్నవయసులోనే భారతీయ సంస్కృతి గురించి ప్రచారం చేస్తున్న తాన్యను పలువురి అభినందిస్తున్నారు.

నాట్యం చేస్తున్న తాన్య

వివేకానందుడి వేషధారణలో...

పోలీసులపై కేసు నమోదు చేయాలి

● క్రాంతి మాదిగ బలవన్మరణంపై హోం మంత్రి, ఎస్సీ కమిషన్ చైర్మన్ స్పందించాలి
● దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్

ఒంగోలు వన్‌టౌన్: విజయవాడలో కృష్ణలంక సీఐ, పోలీసుల వేధింపులతో బలవన్మరణం చెందిన పెరిపోగు క్రాంతిమాదిగ సంఘటనకు సంబంధించి పోలీసులపై కేసు నమోదు చేయాలని, అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సమితి కార్యాలయం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ క్రాంతి మాదిగ ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమని ఆరోపించారు. దానిపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే హోంమంత్రి అనిత, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ మౌనం వహించారని అన్నారు. కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. రాష్ట్రంలోని ఎస్సీల రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా చంద్రబాబు నియమించిన మాజీ మంత్రి కేఎస్ జవహర్ తన సొంత మాదిగ సామాజిక వర్గానికి చెందిన క్రాంతి కుమార్ మాదిగ బలవన్మరణం కేసులో కనిపించకుండా పోయారన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత ప్రతిపక్షాలను విమర్శించడానికి రాష్ట్రంలోని మంత్రులందరి కంటే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. చంద్రయ్య మాదిగ ఇంటికి వెళ్లి డప్పు కొట్టిన మాదిగ పక్షపాతి చంద్రబాబు.. టీడీపీ మద్దతుదారుడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పెరిపోగు వెంకటేశ్వరరావు కొడుకు క్రాంతికుమార్ మాదిగ పోలీస్ వేధింపులతో బలవన్మరణం చెందితే వారింటికి ఎందుకు వెళ్లలేదన్నారు. అదే కృష్ణలంక పోలీస్ స్టేషన్లో సీఐ నాగరాజు, పోలీసుల హింసతో శవం కూడా కనిపించని కాపు కులానికి చెందిన సాయి కృష్ణ కుటుంబ సభ్యులను తన ఇంటికి పిలిపించి ఓదార్చిన ముఖ్యమంత్రి.. మాదిగలను మాత్రం పరామర్శించలేదన్నారు. తెనాలిలో రౌడీ షీటర్ల పేరుతో ముగ్గురు మాల యువకులకు నడిరోడ్డుపై ముగ్గురు సీఐలు అరికాళ్ల కోటింగ్ ఇస్తే.. పోలీసులు కొడితే తప్పేమిటి అన్న రాజ్యాంగ నిపుణురాలు హోం మంత్రి అనిత.. విజయవాడలో జరిగిన కాపు యువకుడు సాయి కృష్ణ, క్రాంతి కుమార్ మాదిగ పోలీస్ హత్యలపై కూడా పోలీసులు చంపితే తప్పేమిటని అంటారేమోనని సందేహంగా ఉందని నీలం నాగేంద్రరావు ఎద్దేవా చేశారు. మాదిగ కుల ప్రతినిధిగా ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిలో ఉన్న మాజీ మంత్రి కేఎస్ జవహర్ రాష్ట్ర కార్యాలయం విజయవాడలో ఉన్నప్పటికీ.. సాటి మాదిగ ఉద్యమకారుడు, టీడీపీ సానుభూతిపరుడు, పోలీస్ హింసతో బలవన్మరణం చెందిన క్రాంతి మాదిగ తండ్రి పెరిపోగు వెంకటేశ్వరరావును ఎందుకు పరామర్శించలేదన్నారు. హోం మంత్రి అనిత, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ తక్షణమే మాదిగ జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. క్రాంతికుమార్ శవానికి పోస్టుమార్టం చేయించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం విజయవాడ పోలీసు అధికారులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, సామాజిక ఉద్యమ నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బొమ్మల వంశీ, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రైతులను మోసం చేసేందుకు కుయుక్తులు

● సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల ధ్వజం

ఒంగోలు టౌన్: పొగాకు రైతులను దెబ్బ తీసేందుకు కొందరు లాలూచీపరులతో బోర్డు అధికారులు సమావేశాల నాటకాలాడుతున్నారని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ధ్వజమెత్తారు. క్వింటా రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు ఉన్నా అవేమీ పట్టించుకోకుండా సమావేశాల పేరుతో రైతులను మోసం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్న బోర్డు అధికారుల తీరు బాగాలేదని విమర్శించారు. బోర్డు అధికారుల మోసపూరిత వైఖరికి నిరసనగా ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో ప్రకాశం భవనం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు. స్థానిక ఎల్బీజీ భవనంలో ఆదివారం సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ రైతు సంఘాల జిల్లా నాయకులు జజ్జురి జయంతి బాబు, వీరారెడ్డి, ఎస్.లలితకుమారి, సీఎస్ సాగర్, ఎస్‌కే మాబు తదితరులు మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా పొగాకు క్వింటా రూ.20 వేలకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. నో బిడ్లలో ఎలాంటి మార్పులేదని తేల్చి చెప్పారు. దిద్దుబాటు చర్యల పేరుతో వ్యాపారులకు మరింత లాభాలు కలిగించే విధంగా , రైతుల కష్టాన్ని దోచుకునే కుట్రలో భాగంగా ప్రీ వారికేటర్స్ పేరుతో కొందరు వ్యక్తులను రంగంలోకి దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థం కోసం రైతులను దగా చేసే వారికేటర్స్‌ను పక్కన పెట్టి ఎలాంటి జాప్యం లేకుండా వర్జీనియా పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1000 కోట్లు కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలోకి దించి రైతులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే బ్యార్నీకి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. క్వింటా పొగాకును రూ.20 వేల కంటే తక్కువకు కొనుగోలు చేస్తే రైతులు వేలాన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రంగారావు

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda
MSME బ్రాంచ్, పోస్ట్ బాక్స్ నెం.21, విజయ కాంప్లెక్స్, ధారావారి తోట, 4వ లైన్, ఒంగోలు - 523001, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
Ph: 08592-233092, E-mail : vjongo@bankofbaroda.com, website : www.bankofbaroda.com

అధీకృత అధికారి పేరు : శ్రీ మార్నేని సుబ్రహ్మణ్యం (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 8977513918

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

అపెండిక్స్- IV – A (రూల్ 6 (2) & 8(6) చూడుము)

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా వారు ఋణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారులు చెల్లించవలసిన దిగువ తెలిపిన బకాయి మొత్తము + వడ్డీ, ఇతర ఖర్చులు వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా వున్నది అక్కడ " మరియు " అక్కడ ఏమున్నదో అదే " పద్ధతి పై విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారులకు ఇందుమూలముగా సూచించటమైనది. ఋణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారులు, బకాయిలు, ఆస్తుల వివరాలు, ఇ-వేలం తేది, సమయం, రిజర్వు ధర, ధరావత్తు మరియు బిడ్డు పెంచు మొత్తం వివరములు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా: M/s. ఎస్.ఎస్.ఆర్. ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్ట్‌నర్స్: శ్రీ చిడిపోతు సుబ్బారావు & శ్రీ గుడిపూడి నరసింహారావు, నివాసం : ప్లాట్ నెం.372, ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్, గుండ్లపల్లి పోస్ట్, మర్రిపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523211. 1. శ్రీ చిడిపోతు సుబ్బారావు, తండ్రి : చిడిపోతు వెంకయ్య, M/s. ఎస్.ఎస్.ఆర్. ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్, నివాసం : ప్లాట్ నెం.బి706, బికె ఎస్‌టాంబింగ్ ఎన్‌క్లేవ్, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523001. 2. శ్రీ చిడిపోతు నరసింహారావు, తండ్రి : చిడిపోతు వెంకయ్య, M/s. ఎస్.ఎస్.ఆర్. ఎంటర్‌ప్రైజెస్ యొక్క పార్టనర్, నివాసం : డి.నెం.4-109, చెల్లమ్మతోట వీధి, శివాలయం దగ్గర, టంగుటూరు పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523274. వేరొక చిరునామా: విజిఎన్ మినర్వ జె 372, గురుస్వామి వీధి, నలంబూరు, మొగప్పెయిర్ ఈస్ట్, తిరువళ్ళూరు, చెన్నై – 600095. హామీదారు: శ్రీ రావి వెంకటేశ్వర్లు, తండ్రి: రావి రమణయ్య, నివాసం : డి.నెం.1-47, శివాలయం వీధి, టంగుటూరు పోస్ట్ & మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523274.

బ్యాంక్‌కు రావలసిన మొత్తం బకాయి: రూ.30,81,843.04 పై (అక్షరాల ముప్పై లక్షల ఎనభై ఒక్క వేల ఎనిమిది పందల నలభై మూడు రూపాయల నాలుగు పైసలు మాత్రమే) + తేది.27.10.2022 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

ఆస్తుల వివరములు (స్వాధీనత స్వభావం : భౌతిక)

ప్రకాశం జిల్లా, అద్దంకి ఎస్ఆర్‌ఓ, అన్నంగి గ్రామం, సర్వే నెం.281, 282 & 289 వద్ద 2978.04 చ॥గజాల విస్తీర్ణంలో ప్లాట్ నెం.372తో గల భూమి మరియు భవనం యాపత్తు ఆస్తి. హద్దులు : తూర్పు: 24 మీ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం : 30 మీ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం. 371, పడమర : ప్లాట్ నెం.373.

రిజర్వు ధర : రూ.54,00,000/- (అక్షరాల యాభై నాలుగు లక్షల రూపాయలు మాత్రమే)
ధరావత్తు : రూ.5,40,000/- (అక్షరాల ఐదు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)
బిడ్ పెంపుదల మొత్తం : రూ.20,000/- (అక్షరాల ఇరవై వేల రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది మరియు సమయం : 07-07-2026 మ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు వేలం ముగిసేవరకు ప్రతీ 10 నిమిషాలకు ఒక్కసారి అన్‌లిమిటెడ్ ఆటో ఎక్స్‌టెన్షన్ ఉండును.

బ్యాంకుకు తెలిసీఉన్నంత వరకు ఎలాంటి జంగూటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

పై ఆస్తులను తేది.02-07-2026 నుండి 04-07-2026 వరకు ఉ॥11.00 నుండి సా॥ 05.00 గం॥ల వరకు తనిఖీ చేసుకోగలరు (ముందస్తు అనుమతితో)

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్ సైట్: https://www.bankofbaroda.in/e-auction.htm మరియు ఆన్‌లైన్ వేలం పోర్టల్ https://baanknet.com. లింక్‌ను రిఫర్ చేయండి. ఆసక్తి గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క ఫోన్ నెం.08592-233092, మొబైల్: 8977513023 ను సంప్రదించగలరు.

తేది : 20-06-2026, ప్రదేశం : ఒంగోలు — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

అద్దంకి: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణంలోని పోతురాజు గండి ప్రాంతంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కావలి గ్రామానికి చెందిన ఎస్ నందు(22) గత నాలుగేళ్లుగా వివాహాది శుభకార్యాల ఈవెంట్లలో పాల్గొని జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో నాలుగేళ్లుగా తనతో పాటు ఈవెంట్లలో పాల్గొనే విజయవాడకు చెందిన యువతితో కలిసి పట్టణంలోని పోతురాజు గండి ప్రాంతంలో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరి మధ్య చిన్నపాటి వివాదం చెలరేగింది. దీంతో ఇద్దరో చెరో బెడ్‌రూంలో నిద్రించారు. ఉదయాన్నే లేచిన ఆ యువతి నందు రూం తలుపుకొట్టగా ఎంతకూ తీయపోవడంతో పోలీసులకు సమాచారం అందించింది. వారు సంఘటనా స్థలానికి చేరుకొని తలుపులు పగులగొట్టి చూడగా నందు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న బంధువులకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నందు మృతదేహం

రాచర్ల మండలంలో 23 మి.మీ వర్షం

అనుమలవీడులో సాగు చేసిన పత్తి పంట

రాచర్ల: మండలంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని గొతవరం, అనుమలవీడు, రాచర్ల, అనుములపల్లె, సోమిదేవిపల్లె, పాలకవీడు, గంగంపల్లె, కాలువపల్లె, ఆకవీడు, చోళ్లవీడు, జేపీ చెరువు గ్రామాల్లో దాదాపు 400 హెక్టర్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షం పత్తి పంటకు ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పదును వాన కురవడంతో వ్యవసాయ బోర్ల కింద సాగుచేసిన పత్తికి నీటి తడులు కట్టే బాధ తప్పిందని రైతులు తెలిపారు. వర్షం కారణంగా పొలాల్లో నీరు చేరడంతో చెరువులను తలపించాయి. అనుమలవీడులోని నక్కలవాగు, గొతవరంలోని పితురువాగులు వర్షం నీటితో నిండుకుండలా దర్శనమిచ్చాయి. మార్కాపురం జిల్లాలోనే రాచర్ల మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్ల మండలంలో 23 మిల్లీమీటర్లు, బేస్త వారిపేట 10.2, కొమరోలు 3.6, కంభం 3.2, గిద్దలూరు మండలంలో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

గంగంపల్లె వ్యవసాయ పొలాల్లో నిలిచిన వర్షం నీరు

పోలీసు లాకప్ హింసలపై విచారించాలి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న హింసపై విచారణ కమిషన్ వేసి సంబంధిత అధికారులపై చట్టపరమైన శిక్షలు విధించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎంసీఏ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐఎల్‌పీఏ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎన్.రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో న్యాయవాది షేక్ కరీముల్లా మాట్లాడుతూ విజయవాడ పోలీసుస్టేషన్లో బాధితుడిని చంపివేసిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసు నినాదం ఒట్టి బూటకమని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడే ప్రజా సంఘాలపై పోలీసుల వైఖరే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రజా సంఘాల నాయకులతో అత్యంత అమానవీయంగా వ్యవహరించడం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు హింసకు అంతులేకుండా పోతుందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా వ్యవహరించడం విచారకరమన్నారు. సమావేశంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్టితోటి శోభన్‌బాబు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్యామ్, ఎం.శాంతారావు, బిల్లా శరత్ బాబు, ధనరాజ్, న్యాయవాదులు నరేంద్ర కుమార్, నాగేశ్వరరావు, ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

మార్కాపురం టౌన్: పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయసునీత తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు. అలాగే 1100 నంబరుకు ఫోన్‌కాల్ చేసి అర్జీని నమోదు చేసుకోవడంతో పాటు అర్జీ ఏ స్థితిలో ఉందో తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు meekoram.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLATS FOR SALE

■ SSS హోమ్స్, ఒంగోలు కర్నూల్‌రోడ్, శ్రీ సరస్వతి కాలేజి ఎదురు నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK ఫ్లాట్స్ (1230 SFT) కలవు. గృహప్రవేశానికి సిద్ధంగా (రెడీ టు ఆక్యూపై) ఉన్నవి. ✆ 97039 98899, 63026 75709. [O-820793]

HOUSE FOR SALE

■ ఒంగోలు, కర్నూ